సాక్షి
అనంతపురం
సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



ఆర్డీటీ పరిరక్షణకు ఉద్యమాలు

పేద ప్రజలకు కల్పతరువులా ఉన్న ఆర్డీటీ పరిరక్షణకు ఉద్యమాలు చేపట్టాలని వక్తలు పిలుపునిచ్చారు.

IIలో



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.17 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.4°/21.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను 'పరిష్కార వేదిక' ద్వారానే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కారుణ్య నియామకాలు నెలలో పూర్తవ్వాలి

- ఫైళ్లు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశం

సాక్షి స్పందన

అనంతపురం అర్బన్: కారుణ్య నియామకాల ప్రక్రియ నెల రోజుల్లో పూర్తవ్వాలని కలెక్టర్ ఓ.ఆనంద్ కలెక్టరేట్ పరిపాలన విభాగం సిబ్బందిని ఆదేశించారు. కారుణ్య నియామకాలు, పదోన్నతుల కల్పనలో జరిగిన జాప్యంపై 'సాక్షి'లో ఈనెల 21న ప్రచురితమైన ''కొత్త సారుపై కొండంత ఆశ'' కథనానికి కలెక్టర్ స్పందించారు. కారుణ్య నియామకాల ఫైళ్లు ఎన్ని ఉన్నాయనే వివరాలను ఆ విభాగం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫైళ్లను సమగ్రంగా సిద్ధం చేసి సమర్పించాలని చెప్పారు. నియామక ప్రక్రియ నెల రోజుల్లో పూర్తికావాలని ఆదేశించారు. అలాగే, పదోన్నతుల కల్పన వివరాలపై ఆరా తీశారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గుమ్మఘట్ట: ఎలుగుబంటి దాడిలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని అడిగుప్పలో జరిగింది. వివరాలు.. ఆదివారం అడిగుప్ప గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామాంజినేయులు గ్రామ సమీపంలో సీతాఫలాలను పీక్కొని వచ్చేందుకు వెళ్లారు. ఫలాలను కోస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇద్దరిపై ఎలుగుబంటి దాడికి దిగింది. ఇద్దరూ కేకలు వేయడం ప్రారంభించడంతో అక్కడి నుంచి పారిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే చంద్రశేఖర్, రామాంజినేయులును రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు.

చికెన్ చేయలేదని కోప్పడ్డ భర్త

- ఉరేసుకున్న భార్య



మృతురాలు మౌనిక



నాలుగు నెలల చిన్నారి (మృతురాలి కుమార్తె)

గుత్తి: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సమీర్ భార్య మౌనిక (23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సమీర్, మౌనిక దంపతులు, వీరికి నాలుగు నెలల చిన్నారి ఉంది. సమీర్ ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఆలస్యంగా ఇంటికి వెళ్లాడు. భార్య మౌనిక పప్పు అన్నం చేసింది. నేను చికెన్ చేయమంటే పప్పు, అన్నం ఎందుకు చేశావని భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం ఇద్దరూ భోజనం చేయకుండా నిద్రపోయారు. సమీర్ నిద్రలో ఉన్న సమయంలో మౌనిక ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే గమనించిన సమీర్ స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మౌనిక మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రిలో హాహాకారాలు

జీజీహెచ్‌లో అధ్వాన పరిస్థితులు

- డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- పేద రోగుల అవస్థలు పట్టని ఆస్పత్రి పాలకులు
- ముగ్గురు మంత్రుల తీరుపై సర్వత్రా విమర్శలు



ఈ ఏడాది ఆగస్టు 5న స్ట్రెచర్ లేక మృతి చెందిన బెళగుప్ప తండాకు చెందిన మూడే మధునాయక్



సర్వజనాస్పత్రిలో ఓపీ చీటీ కోసం క్యూలో రోగులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు పెద్దదిక్కైన సర్వజనాస్పత్రిలో నాణ్యత ప్రమాణాలు రోజురోజుకూ పడిపోతు న్నాయి. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రోగుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఆస్పత్రిలో ఈ ఏడాది ఆగస్టు 5న స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో బెళుగుప్ప తండాకు చెందిన 23 ఏళ్ల మూడే మధునాయక్ అల్ట్రాసౌండ్ స్కాన్ గది వద్ద ప్రాణాలు విడిచాడు. అదే నెల 10న వృద్ధుడు కృష్ణమూర్తి ఆచారిని ఆక్సిజన్ లేకుండా సిటీ స్కాన్‌కు పంపడంతో స్కానింగ్ గది ముందే మృతి చెందాడు. ఈ ఏడాది జులై 7న ఆర్థో వార్డులో ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన 22 ఏళ్ల రాజేష్ అనే యువకుడి మృతి సర్వత్రా చర్చనీయాంశమైంది. రోగులు మృత్యువాత పడడాన్ని సీరియస్‌గా పరిగణించి ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఓపీ, విధులకు గైర్హాజరవుతున్న వైద్యులకు వేతనాల్లో కోత విధించాల్సి ఉంది.కానీ,జీజీహెచ్‌లో అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వరుసగా సంభవిస్తున్న మరణాలు ఆస్పత్రిలో నెలకొన్న అధ్వాన పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

జీజీహెచ్‌లో	
రోజు ఓపీ:	2,500
ఐపీ: 1,100 నుంచి 1,300	

అంతా ఇష్టారాజ్యం..

సర్వజనాస్పత్రిలో ఇటీవల అంతా ఇష్టారాజ్యంగా మారింది. మెడిసిన్, ఈఎన్‌టీ, ఆర్థో, సర్జరీ, పల్మనాలజీ, తదితర విభాగాల్లో నిత్యం కొందరు వైద్యులు విధులకు గైర్హాజరవుతుండగా.. మరికొందరు ముందస్తుగానే బయోమెట్రిక్ వేసుకుని వెళ్లిపోతున్నారు. ఇదే క్రమంలో హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సులు ఆస్పత్రిలోని వారి రూముల్లో ఉండిపోతున్నారు. హెడ్‌నర్సులు ఉదయం 8.45 గంటలకు రావడం, మధ్యాహ్నం 1.30 గంటలకల్లా వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయింది. రక్తనిధిలో సాయంత్రం 4 గంటల తర్వాత వైద్యులు ఉండకపోవడంతో భారమంతా గైనిక్ వైద్యులపై పడుతోంది. ఆస్పత్రి ఉన్నతాధికారుల నిర్లక్ష్యపు నిర్ణయాలు కూడా రోగులకు పెనుశాపంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే క్యాజువాలిటీ విభాగంలో పని చేస్తున్న 8 మంది మెడికల్ ఆఫీసర్లను ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపడంతో సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే ఈ ఏడాది ఆగస్టులో బర్న్స్ వార్డును అనస్తీషియా విభాగానికి కేటాయించడంతో ఆ వార్డులోని రోగులు ప్రత్యక్ష నరకం చూశారు. ఇక.. ఆస్పత్రిలో రోగులు, వైద్యులకందించే డైట్‌లోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. సకాలంలో మందులు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిద్దరోతున్న నిఘా..

రోగులు, వారి బంధువులు, సిబ్బందితో నిత్యం కిటకిటలాడే సర్వజనాస్పత్రిలో నిఘా కరువైంది. మహిళా వైద్యుల పట్ల కొందరు ఎంఎన్‌ఓలు తప్పతాగి మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు. దీనికితోడు ఇటీవల క్యాజువాలిటీలో విధుల్లో ఉన్న హౌస్‌సర్జన్‌ను ప్రేమించాలంటూ ఓ ఆకతాయి వేధించిన ఘటన జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇంత జరుగుతున్నా ఎవరేమైపోతే మనకేం అన్న చందంగా పర్యవేక్షకులు, కొందరు హెచ్‌ఓడీల తీరు సాగుతోంది.

ముగ్గురు మంత్రులున్నా..

కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా సర్వజనాస్పత్రిలో సమస్యలు తీరకపోవడంపై పలువురి నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈయన కాకుండా ఉమ్మడి జిల్లాకు చెందిన మరో ఇద్దరు కేబినెట్‌లో ఉన్నా వసతులు మెరుగు పడకపోవడంతో సామాన్యులకు అవస్థలు తప్పడం లేదు.

సాయి సేవలు.. పేదల జీవితాలకు వెలుగులు



నృత్య రూపకంలో ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: 'లవ్ ఆల్.. సర్వ్ ఆల్'' సందేశాన్నిస్తూ సత్యసాయి ప్రపంచ మానవాళికి వెలకట్టలేని సేవలు అందించారని.. ఆయన సేవలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని భక్తులు సంగీత నృత్య రూపకం ద్వారా చాటిచెప్పారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి మానవాళికి అందించిన సేవలను, నేడు ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలను వివరిస్తూ నృత్యరూపకం సాగింది. ఉదయం శ్రీసత్యసాయి అష్టోత్తర నామావళిని జపించారు.

'దుర్గం'లో గంజాయి పట్టివేత

రాయదుర్గం: ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఒక చోట గంజాయి గుప్పుమంటూనే ఉంది. ఏదో ఒక రూపంలో దుండగులు తీసుకొస్తున్నారు. పోలీసులకు పట్టుబడుతున్నారు. తాజాగా రాయదుర్గం పట్టణంలో ఆదివారం రాత్రి అనుమానిత వ్యక్తులతో గంజాయి పట్టుబడినట్టు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. నిందితులు వేపరాళ్ల, కొత్తిగుట్టకు చెందిన వారై ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. సమగ్రంగా విచారణ జరిపి వివరాలను సోమవారం విలేకర్ల సమావేశంలో వెల్లడిస్తామన్నారు. ఈ కేసులో ఎంత మంది నిందితులున్నా అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.

కానరాని 'రబీ' సన్నాహకం

- సీజన్ సమీపిస్తున్నా చర్యలు ప్రారంభించని వ్యవసాయశాఖ
- ప్రధాన పంటగా పప్పుశనగ 80 వేల హెక్టార్ల సాగు అంచనా
- రాయితీ విత్తనం సకాలంలో ఇవ్వాలంటున్న రైతులు



నల్లరేగడి భూములు

అనంతపురం అగ్రికల్చర్: ఎనిమిది రోజుల్లో కీలకమైన ఖరీఫ్ ముగుస్తుంది. అక్టోబర్ ఒకటి నుంచి రబీ సీజన్ ఆరంభం కానుంది. అక్టోబర్ 15 నాటికి నైరుతీ రుతుపవనాలు వెనక్కివెళ్లడం, ఆ తర్వాత ఈశాన్య రుతుపవనాలు మొదలై వర్షాలు నమోదవుతాయి. జిల్లాకు సంబంధించి ఖరీఫ్‌తో పోల్చితే రబీకి ప్రాధాన్యత తక్కువైనా ప్రధాన పంటగా పప్పుశనగ 80 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో సాగవుతుందని అంచనా. అలాగే వేరుశనగ 20 వేల హెక్టార్లు, ఇతరత్రా పంటలు 20 నుంచి 30 వేల హెక్టార్లలో సాగవుతాయి. మొత్తమ్మీద 1.20 లక్షల హెక్టార్లలో రబీ పంటలు సాగులోకి రానున్నాయి. తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం డివిజన్లతో పాటు నల్లరేగడి భూములు కలిగిన 25 మండలాల పరిధిలో పప్పుశనగ సాగవుతుంది.

139.3 మి.మీ వర్షపాతం..

రబీ సాగుకు అక్టోబర్ కీలకం. డిసెంబర్ వరకు రబీ మూడు నెలల కాలంలో 139.3 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా అందులో అత్యధికంగా అక్టోబర్‌లోనే 100.9 మి.మీ కురవాలి. నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీగా గుర్తించారు. అక్టోబర్, నవంబర్‌లో ఈశాన్య రుతుపవనాలతో పాటు తుపాన్ల కారణంగా కొంత వర్షాలు పడే అవకాశం ఉంటుంది.

కనిపించని సన్నాహక చర్యలు..

రబీ సమీపిస్తున్నా వ్యవసాయశాఖ ఇంకా సన్నాహక చర్యలు మొదలు పెట్టలేదు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు పప్పుశనగ సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షాలు పడితే అక్టోబర్ మొదటి వారంలోనే ముందస్తుగా పప్పుశనగ విత్తుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్‌లో ఉరవకొండ, పెద్దవడుగూరు తదితర ప్రాంతాల్లో సాగు తక్కువగా ఉన్నందున నల్లరేగడి భూములు చాలా వరకు ఖాళీగానే ఉన్నాయి. అందులో ముందస్తు రబీ సాగుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతలోపు రైతులకు రాయితీ విత్తన పప్పుశనగ ఇవ్వాలి. 2019–2024 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అక్టోబర్ మొదటి వారంలోనే 40 శాతం రాయితీతో విత్తన పప్పుశనగ అందించారు. అయితే ఈ సారి ఇంకా దృష్టి సారించకపోవడంతో విత్తన పంపిణీ ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. విత్తనం కోసం ప్రతిపాదనలు, అనుమతులు, టెండర్లు, తర్వాత ప్రాసెసింగ్, విత్తన సరఫరా, రైతు రిజిస్ట్రేషన్లు, పంపిణీ తదితర ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున సాధ్యమైనంత తొందరగా సన్నాహకాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ ఖరీఫ్‌లో చాలా ఆలస్యంగా విత్తన వేరుశనగ ఇవ్వడంతో రైతులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే.

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు

- కాలువ దురాక్రమణ
- అక్రమంగా వెంచర్ వేసేందుకు పన్నాగం
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు



కాలువను ఆక్రమించి వెంచర్ వేసిన దృశ్యం

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్ల అక్రమాలు పెరిగిపోతున్నాయి. 'అధికారం మాది మేమేం చేసినా చెల్లుతుంద'న్న రీతిలో రెచ్చిపోతున్నారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న చందాన ప్రభుత్వ స్థలాలనూ చెరబడుతున్నారు. బీకేఎస్ మండల కేంద్రంలో బ్రాహ్మణ వీధి నుంచి ముసలమ్మ కట్ట వైపు వెళ్లే సిమెంట్ దారి ఎడమ వైపు అనంతపురం–తాడిపత్రి జాతీయ రహదారి సమీపంలో 'పచ్చ' నేతలు అక్రమంగా వెంచర్ వేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అందులోనూ కాలువను ఆక్రమించి వెంచర్ వేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రూ. 1.50 కోట్ల స్థలానికి ఎసరు..

చిక్కవడియార్ చెరువు నుంచి పొలాలకు వెళ్లే కాలువ పక్కనే 90 సెంట్లలో శింగనమల మండలానికి చెందిన టీడీపీ నాయకులు వెంచర్ వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం చెరువు నుంచి పొలాలకు ఉన్న కాలువను ఆక్రమించారు. కాలువ స్థలం 15 సెంట్ల వరకు చెరబట్టారు. ఈ ప్రాంతంలో ఒక్కో సెంటు స్థలం రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు పలుకుతోంది. దీన్ని బట్టి రూ. 1.50 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ స్థలానికి ఎసరు పెట్టినట్లు తెలుస్తోంది.

ప్రజాప్రతినిధి అండతో..

జీఓ నంబర్–12 ప్రకారం లే అవుట్లకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు విధించింది. వ్యవసాయ భూమి అయితే ముందుగా ఆర్డీఓ ద్వారా కన్వర్షన్ చేయించుకోవాలి. ఇందుకు భూమి విలువలో 3 శాతం ఫీజు కింద చెల్లించాలి. వెంచర్ వేసే భూమిలో గ్రామ పంచాయతీకి 10 శాతం రిజిస్ట్రేషన్ చేయించాలి. స్థలం విలువలో 14 శాతం డిపాజిట్టు కూడా చెల్లించాలి. చివరిగా పంచాయతీలో తీర్మానం చేసి అనుమతి పొందాలి. అయితే, 'తెలుగు తమ్ముళ్లు' మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి అండతోనే బరి తెగించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం ముడుపులు కూడా చెల్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతపురం నగరానికి, ఇటు బీకేఎస్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో కోట్లాది రూపాయల విలువైన కాలువ స్థలం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.



దసరా ఉత్సవాలకు ముస్తాబైన అనంతపురంలోని కొత్తూరు అమ్మవారి శాల

జిల్లా అంతటా శరన్నవరాత్రుల సందడి మొదలైంది. విద్యుద్దీపాలంకరణల నడుమ అమ్మవారి ఆలయాలు కాంతులీనుతున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న అమ్మవారి నామం అంతటా మార్మోగుతోంది. సోమవారం నుంచి ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

డిమాండ్ల సాధనకు పోరుబాట

- నేటి నుంచి సచివాలయ ఉద్యోగుల సమ్మె
- ఇప్పటికే ఉన్నతాధికారులకు నోటీసు



నగరపాలక సంస్థలో అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం సిటీ: తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం సచివాలయ ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. సోమవారం నుంచి సమ్మెకు దిగుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో 1,700 మందికి పైగా వివిధ కేటగిరిల్లో ఉద్యోగులు పని చేస్తున్నారు. తమ డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పష్టత లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులను అందించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన..

సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం, ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలియజేయడం, 26న మధ్యాహ్న భోజన సమయంలో ప్లకార్డుల ప్రదర్శన, 27న మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేత, 28న విశాఖపట్నంలో ప్రాంతీయ సభ, అదే రోజున ఆత్మగౌరవ శంఖారావం పేరిట 26 జిల్లాల్లో స్టీరింగ్ కమిటీ సమావేశాలు, 29న సామాజిక పింఛన్ డ్రా, లబ్ధిదారులకు నగదు అందజేసిన తర్వాత అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగడం, అక్టోబర్ 1న నల్లబ్యాడ్జీలు ధరించి పింఛన్ పంపిణీ, 2న ప్రత్యక్ష కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా నిరసన, 3న సమావేశాలు, 4న స్టీరింగ్ కమిటీ సమావేశాలు, 5న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ సభ.

డిమాండ్లు ఇవే..

సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పడం నుంచి విముక్తి కల్పించాలి. విద్యార్హతల ఆధారంగా విధులు అప్పగించాలి. సమయపాలన లేని, ఒత్తిడితో కూడుకున్న విధుల నుంచి విముక్తితో పాటు సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతంగా చేయిస్తున్న విధులకు స్వస్తి పలకాలి. ఆరేళ్లు ఒకే కేడర్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన ప్రైమ్‌టైం నిర్ణయించాలి. సర్వేలను ఆయా శాఖల ఉద్యోగులతో నిర్వహించాలి. సచివాలయ సిబ్బందిపై భారం తగ్గించాలి. ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్పు చేయాలి. సచివాలయ ఉద్యోగుల స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శకంగా బదిలీలు జరిగేలా ప్రత్యేక విధి విధానాలు, తదితర డిమాండ్ల సాధనకు సచివాలయ ఉద్యోగులు సమ్మెకు శ్రీకారం చుట్టారు.

రాజీలేని పోరాటం

గతంలోనే ప్రభుత్వానికి సమస్యలను రాష్ట్ర నాయకత్వం తెలియజేసింది. కానీ ఎటువంటి మార్పు లేదు. పనిభారంతో సచివాలయ ఉద్యోగులంతా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో కమిషనర్లకు సమ్మె నోటీసును అందించాం. డిమాండ్ల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేస్తాం.

– లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగుల సంఘం నేత, అనంతపురం

క్లుప్తంగా

చీనీ చెట్ల నరికివేత



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బెళుగుప్ప: మండల పరిధిలోని విరుపాపల్లికి చెందిన రైతు హరికృష్ణకు చెందిన వంద చీనీ చెట్లను దుండగులు నరికివేశారు. బాధిత రైతు వివరాలమేరకు.. హరికృష్ణ 4.5 ఎకరాల్లో ఐదేళ్ల క్రితం చీనీ చెట్లను నాటాడు. ప్రస్తుతం అంతర పంటగా వేరుశనగ సాగు చేశాడు. మరో మూడు నెలలకు చీనీ పంటను కాపుకు వదులుదాని భావించిన తరుణంలో శనివారం రాత్రి వంద చీనీచెట్లను దుండగులు నరికేశారు. ఘటనా స్థలాన్ని ఉరవకొండ రూరల్ సీఐ మహానంది, ఎస్ఐ శివ పరిశీలించారు.

సంతల ఆదాయం రూ.3.61 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.61 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,19,850 వసూలు కాగా..ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,41,800 మేర వసూలైనట్లు తెలిపారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఉద్యమాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో డాక్టర్ గేయానంద్ తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీని పరిరక్షించుకునేందుకు ఉద్యమాలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆర్డీటీ పరిరక్షణకై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, సీపీఐ నాయకుడు మల్లికార్జున హాజరయ్యారు. సమావేశానికి సాకే హరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి , రంగయ్య మాట్లాడుతూ ఎంతో కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఆర్డీటీ సంస్థ వచ్చి దళిత, గిరిజనులతో పాటు బీసీలకు అండగా ఉండి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం కుట్రతో నిధులు రానివ్వకుండా అడ్డుకుందన్నారు. దీని వల్ల పేదలకు నష్టం జరుగుతోందన్నారు. కనీసం కూటమి ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్చ జరపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. తక్షణం నిధులు విడుదల చేసి ఆర్డీటీ పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే అఖిల పక్ష కమిటీ తీసుకున్న నిర్ణయాలకు తాము మద్దతు ఇస్తున్నామన్నారు. సాకే హరి మాట్లాడుతూ సేవ్ ఆర్డీటీ కోసం కేంద్ర కార్యాలయాలు ముట్టడి, రైలు రోకోలు, జాతీయ రహదారుల దిగ్బంధం, జిల్లా బంద్, రాష్ట్రబంద్, చలో ఢిల్లీ కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆర్డీటీని కాపాడుకునేంతవరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నరేష్ కోడవండ్ల, సుగమంచి శ్రీనివాసులు, బీసీఆర్ దాస్, కేపీ నారాయణస్వామి, అక్కులప్ప, కుంటిమద్ది ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, రామచంద్ర, అల్లీపీరా, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైమ్ స్కేల్ అమలు చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో ఉద్యోగులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బాలకాశి వాపోయారు. ఆదివారం స్థానిక కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా జేఏసీ అధ్యక్షుడు కె.విజయ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎం.బాలకాశి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీలలో పనిచేస్తున్న సిబ్బంది 14 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారన్నారు. కేజీబీవీ ఉద్యోగులకు సరైన ఉద్యోగ భద్రత లేదన్నారు. వారిని రెగ్యులర్ చేసేదాకా మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలోకి విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. సమావేశంలో పీటీఐ అసోసియేషన్ దివాకర్‌రావు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ గీత, రూప, లలిత, షబానా, సునీత, రమాదేవి, సీఆర్టీలు అరుణ, సౌభాగ్యలత, పీజీటీలు ఇంద్రజ, ఖాజాంబి పాల్గొన్నారు.

'కిమ్స్ సవీర'లో మహిళ మృతి

- ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు



బాధితులకు సర్దిచెబుతున్న పోలీసులు

అనంతపురం మెడికల్: నగరంలోని శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న కిమ్స్- సవీర ఆస్పత్రిలో ఓ మహిళ మృతి వివాదాస్పదంగా మారింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే... ధర్మవరానికి చెందిన పార్వతి (39) ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యతో ఈ నెల 17న సర్వజనాస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. కాగా వైద్యులు పార్వతి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబీకులు పార్వతిని నగరంలోని కిమ్స్-సవీరకు తరలించారు. ఈ నెల 20న రాత్రి పార్వతి పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకులు పార్వతిని వేరే ఆస్పత్రికి తరలించాలని చూశారు. అంతలోపే పార్వతి మృత్యువాత పడినట్లు వైద్యులు పేర్కొన్నారు. వెంటిలేటర్ లేకుండానే పార్వతిని కిందకు పంపారని, అందుకే చనిపోయిందని పార్వతి బంధువులు ఆరోపించారు. రూ.2 లక్షల వరకు బిల్లు చేశారని, చివరకు మృతదేహాన్ని చేతికిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం చేసే వరకూ మృతదేహాన్ని తీసుకెళ్లబోమని ఆస్పత్రి నిర్వాహకులకు తేల్చి చెప్పారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. చివరకు ఆదివారం ఉదయం పార్వతి మృతదేహాన్ని కుటుంబీకులు ఇంటికి తీసుకెళ్లారు.

ఇదిలా ఉంటే.. తమ వైద్యులు పార్వతికి మెరుగైన వైద్యసేవలు అందించారని కిమ్స్ సవీర సీఓఓ సిద్ధారెడ్డి తెలిపారు. జీజీహెచ్‌కు తీసుకెళ్తామన్న బంధువుల విజ్ఞప్తి మేరకే వైద్య సదుపాయాలతో సీనియర్ వైద్యుడు, స్టాఫ్‌నర్సు సమక్షంలో పార్వతిని తరలించే ప్రయత్నం చేశారని చెప్పారు. అత్యవసర విభాగం వద్దకు వచ్చే సరికి పార్వతి ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఆమె చనిపోయిందన్నారు. సేవలందించడంలో తమ తప్పిదం ఎక్కడా లేదన్నారు..

శరన్నవరాత్రి ఉత్సవాల ఫ్లెక్సీల కోసివేత

- ఆందోళనకు దిగిన ఆర్యవైశ్యులు
- బీజేవైఎం నాయకులపై చర్యలకు డిమాండ్



ఫ్లెక్సీలను కోసేసిన దృశ్యం



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్యవైశ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీవాసవీ మాత ఆలయంలో అత్యంత వైభవంగా జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మెయిన్‌రోడ్డులో వేయించిన స్వాగత తోరణాల ఫ్లెక్సీలను బీజేవైఎం నాయకులు బ్లేడ్‌లతో కోసేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి మెయిన్‌రోడ్డులోని వాసవీ ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఫ్లెక్సీలను కోసేసిన సమాచారాన్ని తెలుసుకున్న ఆర్యవైశ్యులంతా పెద్ద సంఖ్యలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల ఫ్లెక్సీల్లో కమర్షియల్ అడ్వర్‌టైజ్‌మెంట్లు ఎలా వేయిస్తారని, తొలగించకపోతే వాటిని కాల్చివేస్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తనకు ఫోన్ చేసి హెచ్చరించారన్నారు. ప్రతి యేడాది మాదిరిగానే ఫ్లెక్సీలను వేయించామని, కమిటీ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ఒక రోజు గడువు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అయినా వినకుండా ఆదివారం రాత్రి బీజేవైఎం జిల్లా మాజీ కార్యదర్శి కేశవ, చక్రపాణి, మరికొందరు ఫ్లెక్సీలను బ్లేడ్‌లతో కోసేశారని చెప్పారు. అడ్డుకునేందుకు వెళ్లిన స్థానికులను బెదిరించారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో పోలీసులు తమకు న్యాయం చేయట్లేదంటూ మెయిన్‌రోడ్డులోని అమ్మవారి గుడి ఎదురుగా ఆర్యవైశ్యులంతా బైఠాయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కృపాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, లాయర్ రెంటాల మధు, ఇల్లూరు లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీనాథ్‌గౌడ్, కౌన్సిలర్ పవన్‌గౌడ్, ఆర్యవైశ్య కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, టూటౌన్ సీఐ మస్తాన్, ఎస్ఐ వెంకటస్వామిలు సంఘం పెద్దలతో మాట్లాడి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో ఆదివారం కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధిత గొర్రెల కాపరి చిత్రా కాటమయ్య వివరాలమేరకు... తన గూడు వద్ద ఉంచిన గొర్రె పిల్లలపై కుక్కలు దాడిచేశాయన్నారు. 25 పిల్లల మృతితో సుమారు రూ. లక్ష వరకూ నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మాదక ద్రవ్యాల కేసులో డెంటిస్ట్ అరెస్ట్

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటకు చెందిన దంత వైద్యుడు కళ్యాణ్‌శెట్టిని ఎండీఎంఎం మాదకద్రవ్యాలు, గంజాయి అమ్మకం కేసులో కర్ణాటకలోని దావణగెరె సీఈఎన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అతనితో పాటు నైజీరియా దేశానికి చెందిన ఇద్దరు, బెంగళూరుకు చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కళ్యాణ్‌శెట్టి తండ్రి ఆర్ఎంపీ వైద్యుడు నాగేంద్ర గుప్తా చాలా కాలం నుంచి వైఎన్ హొసకోటలో వైద్య వృత్తి చేస్తున్నాడు. కళ్యాణ్‌శెట్టి.. దావణగెరెలోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో దంత వైద్యుడిగా పనిచేస్తూ మరోవైపు గంజాయి, ఎండీఎంఏ మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తుండేవాడు. పక్కా సమాచారం మేరకు దావణగెరె సీఈఎన్ పోలీసులు దాడులు జరిపి కళ్యాణ్‌శెట్టిని దావణగెరెలో, ఇద్దరు నైజీరియా దేశస్తులను, మరో ఇద్దరు బెంగుళూరు వాసులను మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

ఉరవకొండ: స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 28వ సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడాశాఖ అధికారి మంజుల, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా సెపక్‌తక్రా క్రీడల ఛైర్మన్ సప్తగిరి మల్లికార్జున, ప్రెసిడెంట్ షాహిన్, ఎస్‌కెఆర్‌సీ క్లబ్ రవీంద్ర, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సత్యసాయి జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి మురార్జీ యాదవ్, రాష్ట్రస్థాయి క్రీడ పోటీల ఆర్గనైజర్ సీనియర్ పీడీ మారుతిప్రసాద్ పాల్గొని క్రీడాకారుల గౌరవవందనం స్వీకరించారు. మంజుల మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలకు ఉరవకొండ వేదికగా కావడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు 26 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు హాజరయ్యాయి.

ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టుకు ఎంపిక



బి. అనూష



ఎస్.హరిత

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ ఉమెన్ టీ–20 జట్టులో అనూష, ఎస్. హరితకు చోటు దక్కింది. బీసీసీఐ సీనియర్ ఉమెన్ టీ–20 అంతరాష్ట్ర టోర్నమెంట్ బరోడాలో అక్టోబర్ 8 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఇందులో అనంతపురం జిల్లా నుంచి బి. అనూష, ఎస్. హరిత ఆడనున్నారు. నార్పల మండలం బండ్లపల్లికి చెందిన అనూష ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో భారత ఉమెన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అనూష ప్రస్తుతం ఆంధ్రా , రైల్వే జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గుంతకల్లుకు చెందిన ఎస్. హరిత అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందారు. కుడిచేతి బ్యాట్స్‌మెన్, కుడిచేతి లెగ్ స్పిన్నర్. సౌత్ జోన్ టోర్నీలో 7 వికెట్లు తీసి ప్రతిభ చాటారు.

ఆంధ్రా జట్టు కెప్టెన్‌గా వీరారెడ్డి





కోగటం హనీష్ వీరారెడ్డి, ఏ.జయంత్ కృష్ణ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ జట్టు (అండర్–19) కెప్టెన్‌గా కోగటం హనీష్ వీరారెడ్డిని ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా నుంచి కోగటం హనీష్ వీరారెడ్డి, తాడిపత్రికి చెందిన జయంత్‌కృష్ణ జట్టులో చోటు దక్కించుకున్నారు. అక్టోబర్ 9 నుంచి 25 వరకూ వినూ మన్కడ్ వన్డే ట్రోఫీ హర్యానా రాష్ట్రంలో జరగనుంది. ఇందులో అనంతపురం జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. ఎడమ చేతివాటం ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన వీరారెడ్డి అండర్–19 కేటగిరిలో అత్యంత ఎక్కువ పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లోనూ తొలి సెంచరీ సాధించిన ఘనత దక్కింది. అలాగే ఏ.జయంత్ కృష్ణ కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. అంతర జిల్లా మ్యాచ్‌ల్లో డబుల్ సెంచరీ సాధించాడు. అహమ్మదాబాద్‌లో జరిగిన రిలయన్స్ టోర్నీలో సత్తా చాటాడు.





క్లుప్తంగా

ఆకట్టుకున్న 'రథ సారథి'



చిత్ర యూనిట్‌ను అభినందిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నిజాయితీకి దర్పణంలా నిలిచి బాధ్యతలకు అద్దం పడుతూ సామాన్యుల జీవితాలను 'రథసారథి' చిత్రం అద్భుతంగా ఆవిష్కరించింది. బతుకు భారమైనా బాధ్యత మరచిపోని ఆటో డ్రైవర్ల నీతి, నిజాయితీల నేపథ్యంలో సాగిన చిత్రం సందేశాత్మకంగా ఉందని పలువురు వక్తలన్నారు. సీనియర్ కళాకారుడు, చిత్రకారుడు కుంచె తిప్పేస్వామి దర్శకత్వంలో నిర్మాణమైన 'రథ సారథి' లఘుచిత్రం ఉచిత ప్రదర్శన ఆదివారం నగరంలోని నీలిమ థియేటర్‌లో జరిగింది. జిల్లా వ్యాప్తంగా సీనియర్ కళాకారులు, గాయకులు, రచయితలు, కవులు ఆత్మీయంగా పాల్గొని చిత్రబృందాన్ని అభినందించారు. సామాజిక సేవా కార్యకర్త డిస్కవరి అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఇమామ్, సీనియర్ డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా అనంత కళారంగానికి సేవలందిస్తున్న తిప్పేస్వామి అద్భుతమైన సందేశాత్మక చిత్రాన్ని తీయడం అభినందనీయమన్నారు. నటీనటులు రమ్య దాసరి, చిరంజీవి, శ్రీనిధి రఘు, జగదీష్, వెంకటేష్ లక్కి అద్భుతంగా నటించి మెప్పించారని కొనియాడారు. కార్యక్రమంలో చిత్ర సమర్పకులు జీఎం సురేష్‌తో పాటు చేతన్‌కల్యాణ్, బొట్టు రాజు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు

రాప్తాడు: పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రైవేట్ కార్మికుడు ఎస్‌కే బైసి విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడటానికి కారణమైన ఏఈ శివప్రసాద్‌నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. హంపాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫిట్టింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎల్‌సీ తీసుకుని పనిచేయించాల్సిన ఏఈ.. కిందిస్థాయి సిబ్బందికి చెప్పి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే కార్మికుడి షాక్‌కు గురై కర్నూలు ఆస్పత్రిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. గతంలో కూడా ఏఈ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రత్యేక చొరవ తీసుకుని తీవ్రంగా గాయపడిన కార్మికుడి వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించేలా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బారావు, లక్ష్మన్న, అమర్ నాథ్, శివకుమార్, వెంకట్ రాముడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



లైంగిక నేరారోపణలు ఉన్న వారిని హెచ్చరిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోక్సో కేసు, లైంగిక నేరాలకు పాల్పడిన వారిని ఆదివారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి నేరాలకు పాల్పడినా, వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే నేరారోపణలు ఉన్న వారు గ్రామాల్లో క్రమశిక్షణతో, ప్రశాంతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మహిళలు, బాలికల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం సాధ్యమని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి, సీనియర్ కోచ్ శాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంతటా అమ్మ నామస్మరణే

- నేటి నుంచి శరన్నవరాత్రులు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



కొత్తూరు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణ నడుమ శివబాలయోగి ఆశ్రమం



త్రిలోకపావని లలితాపరమేశ్వరి

అనంతపురం కల్చరల్: దేవీ నవరాత్రి మహోత్సవాల రాకతో నగరంలో భక్తిభావం ఉట్టిపడుతోంది. ఆదివారం అమావాస్య రాకతో మాలయపక్షాలు ముగిసి భక్తజనానికి నేత్రానందం కల్గించే శరన్నవరాత్రుల సందడి సోమవారం నుంచి ఘనంగా ప్రారంభం కానుంది. దసరా వేడుకల కోసం నగరంలోని ఆలయాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. 22 నుంచి వచ్చేనెల 2 వరకు మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి రూపాత్మకమైన లలితాత్రిపుర సుందరీదేవి అనుగ్రహం భక్తులందరికీ కల్గించే ఉత్సవాలు పదిరోజుల పాటు జరుగుతాయి. చివరిరోజు శయోనోత్సవంతో వేడుకలు ముగుస్తాయి. అయితే ఒకే రూపంలో కాకుండా తొమ్మిది విభిన్న రూపాలలో చండిగా, కాళీగా, మహిషాసుర మర్దినిగా జగన్మాత దర్శనమిస్తుంది.జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరగనున్నాయి. కాగా నగరంలోని శారదా శృంగేరీ శంకర మఠంలో ఆదివారం నుంచే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రత్యేకం.. శ్రీపీఠం

దసరా వేడుకలంటే అమ్మవారి అలంకార సేవలు ప్రతిచోలా పెద్ద ఎత్తున జరుగుతాయి. వాటికి భిన్నంగా సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ రెండో రోడ్డులోని జ్ఞానపీఠంలో ఆధ్యాత్మిక వేత్త మధుజీ నేతృత్వంలో పదిరోజుల పాటు హోమాలు, యజ్ఞాలు, అన్నప్రసాద వితరణ జరుగుతాయి. నిత్య అలంకార సేవలతో పాటు చివరిరోజు గ్రామోత్సవం కనులపండువగా నిర్వహిస్తారని పీఠం ప్రతినిధులు తెలిపారు.

- దసరా ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలలో విశేషంగా జరుగుతాయి. కొత్తూరు, పాతూరులో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో పెద్ద ఎత్తున దసరా వేడుకలు జరగనున్నాయి. 10 రోజుల పాటు వాసవీ మాతను దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.
- జిల్లా కేంద్రంలో శివకోటి, శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ,కొల్హాపూరు మహాలక్ష్మి మందిరం, ఐదో రోడ్డులోని యల్లమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాలు, తాడిపత్రి బస్టాండు చౌడేశ్వరీ మాత,మారుతీనగర్‌లో కొలువైన రామాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజూ సాయంత్రం సాంస్కృతిక సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

రాప్తాడు: విజయదశమి పండగను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు శోభ వచ్చింది. దేవీ శరవన్నవరాత్రుల ఉత్సవాలకు రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అమ్మవారి ఆలయాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీప అలంకరణ పనులు జరుగుతున్నాయి. చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. గౌరీ ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి, రాప్తాడులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవి, రాప్తాడులో పెద్దమ్మ, మారెమ్మ, బుక్కచెర్లలో నల్లాలమ్మ, గంగలకుంటలో దుర్గాదేవి ఆలయంతో పాటు చిన్మయనగర్‌లోని ఇందిరమ్మ కాలనీ, ప్రసన్నాయపల్లి గ్రామాల్లో దుర్గా దేవి కోసం ప్రత్యేక టెట్లు ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. నవరాత్రుల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాప్తాడు మండలంలోని అన్ని దేవాలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.



గౌరీ ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరనున్న దుర్గాదేవి



చిన్మయనగర్‌లో దసరా ఉత్సవాలకు సిద్ధమవుతున్న గౌరీ ప్రసన్నేశ్వర స్వామి ఆలయం



రాప్తాడులో పార్వతి దేవి



గంగలకుంటలో కొలువుదీరనున్న అమ్మవారు

జేసీ ఆదేశాలు బేఖాతర్

- ఇళ్ల వద్ద అందని స్మార్ట్ రైస్ కార్డులు
- సచివాలయాల్లో పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



లబ్ధిదారురాలికి స్మార్ట్ రైస్‌కార్డు అందజేస్తున్న స్టోర్ డీలర్ భరత్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పఠాన్ సైపుల్లాఖాన్, సచివాలయ ఉద్యోగిని

రాప్తాడురూరల్: 'ప్రభుత్వం సిద్ధం చేసిన స్మార్ట్ రైస్ కార్డులు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అందజేస్తారు. కొన్నిచోట్ల రేషన్‌షాపుల వద్ద పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఇందుకు సచివాలయ ఉద్యోగులే బాధ్యత వహించాల్సి ఉంటుంద'ని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఇటీవల హెచ్చరించారు. కానీ ఆయన ఆదేశాలను సచివాలయ సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట ఐదో సచివాలయం వద్దకే లబ్ధిదారులను పిలిపించుకుని అందజేస్తున్నారు. పైగా టీడీపీ చోటా నాయకులు తమ ప్రచార ఆర్భాటానికి సచివాలయాన్ని వేదికగా ఉపయోగించుకుంటున్నారు. టీడీపీకి చెందిన స్టోర్ డీలర్ భరత్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పఠాన్ సైపుల్లాఖాన్ దగ్గరుండి వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన సచివాలయ ఉద్యోగిని కూడా వీరితో పాటు కూర్చుని పంపిణీ చేయడం గమనార్హం. ఈ ఒక్కచోటే కాదు అనంతపురం రూరల్ మండలంలోని చాలా సచివాలయాల్లో ఇదే దుస్థితి. సచివాలయాలతో పాటు రేషన్‌షాపుల వద్ద కుప్పలుకుప్పలుగా కార్డులను పడేసి లబ్ధిదారులను అక్కడికే పిలిపించి అందజేస్తున్నారు. పాపంపేట 5వ సచివాలయం వద్ద కొందరు మహిళలు 'ఇళ్ల వద్దకు వచ్చి ఇవ్వాలి కదా' అని ప్రశ్నించగా...లేదు లేదు ఇక్కడికే వచ్చి తీసుకెళ్లాలంటూ కొందరు టీడీపీ నాయకులు చెబుతుండడం గమనార్హం.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు చేశారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. దసరా ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయంలోని పార్వతీ దేవికి, మంజునాథ స్వామికి అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

24న హుండీ లెక్కింపు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాబు ఆదివారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని తెలియజేశారు.



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

సిబ్బందికి 'ఉపాధి'

- ప్రతి పనికీ చేయి తడపాల్సిందే
- ఉపాధి హామీ పనుల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు



ఉపాధి హామీ కార్యాలయం

ఆత్మకూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బిల్లులతో పాటు ప్రతి పనికీ కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో 10,138 జాబ్ కార్డులు ఉన్నాయి. 8,377 మంది ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉపాధి హామీ కింద కూలీలకు పనులు కల్పించడంతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం కూడా అందిస్తున్నారు. అందులో భాగంగా మండలంలో చీనీ, మామిడి, నిమ్మ, అంజూర్, జామ తదితర ఉద్యాన పంటలకు సంబంధించి 2025–26 సంవత్సరానికి 153 మందికి రైతులకు గాను 567 ఎకరాల్లో ఉద్యాన పంటలకు అనుమతి ఇచ్చారు. ఓ గ్రామంలో ఒక రైతుకు గతంలో సాగు చేసిన చీనీ చెట్లను తాజాగా నాటినట్లు చూపి బిల్లులు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు ఖాతాలో దాదాపు రూ.26 వేల నగదు జమ కాగా.. అందులోంచి రూ.15 ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ డిమాండ్ చేశాడు. ఇందుకు సదరు రైతు ససేమిరా అనడంతో వ్యవహారం నియోజకవర్గ ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది.

- ఒక పంచాయతీలో ఉద్యాన పంట సాగు చేసేందుకు రైతు పేరు ఆన్‌లైన్ వచ్చింది. సదరు రైతు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే.. 'ఉపాధి హామీ పుస్తకం ఆన్‌లైన్‌లో డిలీట్ అయ్యిందని, వెంటనే చేయాలంటే ఖర్చవుతుందని' చెప్పాడు. తర్వాత రైతు తనకు తెలిసిన వారి సహాయంతో ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లి పరిశీలించగా ఆన్‌లైన్‌లో పుస్తకం ఉన్నట్లు తెలిసింది. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.
- మరో పంచాయతీలో మామూళ్లకు అలవాటు పడ్డ సిబ్బంది కూలీలు పనికి వెళ్లకపోయినా బిల్లు పెట్టిస్తానని డబ్బు వసూలు చేశారని తెలిసింది. పనులు చేసిన వారి నుంచి కూడా బిల్లుల కోసం డబ్బు వసూలు చేస్తుండటం గమనార్హం.

డాక్టర్ హరిప్రసాద్‌కు హాస్యభారతి పురస్కారం



హాస్యభారతి పురస్కారమందుకున్న డాక్టర్ హరిప్రసాద్



కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు, రచయితలు

అనంతపురం కల్చరల్: మానసిక ఆనందాన్ని అందించే హాస్యభారతి వంటి కార్యక్రమాలు తరచుగా అన్ని చోట్లా జరగాలని వక్తలన్నారు. దసరా పర్వదినాల నేపథ్యంలో ఆదివారం హాస్యభారతి పునఃప్రారంభమైంది. స్థానిక వివేకానంద యోగా భవన్ వేదికగా హాస్యరచయిత తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, కవయిత్రి డాక్టర్ అనంత మాలతి, బీఎస్ఎన్ఎల్ రాజశేఖరెడ్డి, జన ప్రియకవి ఏలూరు యంగన్న, భూమిపుత్ర హరి, మానవతా కో కన్వీనర్ సలీం మాలిక్ తదితరులు మాట్లాడారు. పెద్ద ఎత్తున నవ్వుకునే సందర్భాలే కరువవుతున్న నేపథ్యంలో ఆరోగ్యాన్నందిస్తున్న హాస్యభారతి నిర్వాహకులు అభినందనీయమన్నారు. అంతకు ముందు నాగళయనారెడ్డి, సుధాకరమూర్తి, శ్రీధర్, హరికృష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివశంకరనాయుడు, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, డాక్టర్ ఉమేష్‌కుమార్, రియాజుద్దీన్, మిద్దె మురళీకృష్ణ, జూటూరు షరీఫ్ తదితరులు హాస్యప్రియులను కడుపుబ్బా నవ్వించారు. ఆర్టీసీ శ్రీనివాస్ మిమిక్రీతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చానల్స్ ద్వారా అందరినీ నవ్విస్తున్న డాక్టర్ హరిప్రసాద్, గాయత్రిలకు హాస్యభారతి పురస్కారాలనందించి సత్కరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె



విద్యుద్దీపాలంకరణలో ఆర్ఎఫ్ రోడ్డులోని ఆలయం

అనంతపురం కల్చరల్: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన దేవదేవుని బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడంతో నగరంలోని శ్రీవారి ఆలయాలు కొత్త శోభ సంతరించుకున్నాయి. స్థానిక శ్రీనివాసనగర్‌లోని బాలాజీ మందిరం, హౌసింగ్‌బోర్డు, రామనగర్ తదితర ప్రాంతాల్లో వేడుకలు కనుల పండువగా జరగనున్నాయి. ముఖ్యంగా నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డులో కొలువైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శోభాయమానంగా మారాయి. ఈ నెల 22 నుంచి వచ్చేనెల 3 వరకు పది రోజుల పాటు స్వామి వారు వివిధ అలంకారాలలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

శేషవాహనంతో మొదలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు 22న అంకురార్పణ, 23న శేషవాహనం, 24న హంసవాహనం, 25న సింహవాహనం, 26న సర్వభూపాళ వాహనం, 27న హనుమంత వాహనం, 28న గరుడ వాహనం, 29న గజవాహనం, 30న చంద్రప్రభ వాహనం, వచ్చే నెల 1న అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. 2న మహా రథోత్సవం జరుగుతుంది. 3న చక్రస్నానం ధ్వజ అవరోహణంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ శాస్త్రి, కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయంలో నిత్యం విశేష పూజోత్సవాలు, పుష్పాలంకరణ సేవలు, ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

'అక్షర విన్యాసాలు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టినట్టుండే 'అక్షర విన్యాసాలు', 'గేయములు–పాటలు' పుస్తకాలను అందరూ చదవాలని వైఎస్సార్ స్మారక జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ అన్నారు. బిక్కి నాగమ్మ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్ వేదికగా సంగీత కళాకారుడు, కథా రచయిత అగ్రహారం సత్యనారాయణ రచించిన 'గేయములు–పాటలు' 'అక్షర విన్యాసాలు' పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. రాజారామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శాంతి నారాయణ, పుస్తక సమీక్షకులుగా డాక్టర్ అంకే శ్రీనివాస్, సామాజిక విశ్లేషకుడు, సంగీతవాణి అడవాల శేషగిరిరాయుడు, ఆత్మీయ అతిథులు గురువేపల్లి నరసింహులు, అచ్చన్న, గంగన్న తదితరులు మాట్లాడారు. భాషా పరిశోధనల కృషి పుస్తకంలో కనిపిస్తుందని, మరో పెద్ద బాలశిక్షలా సాహితీ చరిత్రలో నిలిచిపోయే విధంగా రచన సాగిందన్నారు. పుస్తక రచయిత సత్యనారాయణ మాట్లాడుతూ పుస్తకాలను తెలుగు టీచర్లకు ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు యామలపల్లె నర్సిరెడ్డి, కార్తీక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

అనంతపురం సెంట్రల్: నగరంలోని బేరాక అనాథాశ్రమంలో ఆదివారం డాక్టర్ గఫూర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది అనాథలు, మతిస్థిమితం లేని వారికి ఉచితంగా మందులు అందజేశారు. జన్మనిచ్చి, పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులను అనాథలుగా వదిలేయడం బాధాకరమని, ఇలాంటి వారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని డాక్టర్ గఫూర్ సూచించారు. కార్యక్రమంలో బేరాక అనాథాశ్రమ నిర్వాహకులు శ్రీరాములు, ప్రమీలమ్మ, డాక్టర్ ఎస్వీ సుబ్రమణ్యం, డాక్టర్ మమతశ్రీ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

సుంకర రమేష్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త సుంకర రమేష్ జాతీయ అవార్డు అందుకున్నారు. 'నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ యాక్టివిస్టు' (నిఫా)ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రీత్ పాల్ సింగ్ పన్, రష్యా ఆర్ట్స్ అండ్ కల్చరల్ ప్రతినిధి మంగళ్ దూబే, జపాన్ ఎడ్యుకేషనల్ ప్రతినిధి మయాను టనక తదితరులు రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యుడిగా, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడిగా సుంకర రమేష్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రమేష్‌ను డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, సాహిత్యభారతి, టౌన్‌బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు.

అలరించిన 'కాలభైరవ సంహారం' నాటకం

అనంతపురం కల్చరల్: స్థానిక లలితకళాపరిషత్తులో ఆదివారం ప్రదర్శించిన 'కాలభైరవ సంహారం' నాటకం ఆహూతులను అలరించింది. ఎల్కేపీ మాజీ కార్యదర్శి గాజుల నారాయణస్వామి జయంతి సందర్భంగా ఈ నాటకాన్ని ప్రదర్శించారు. సీనియర్ నటుడు రామగోవిందసాగర్ దర్శకత్వంలో జిల్లాకు చెందిన నటీనటులు అద్భుతంగా ప్రదర్శించారు. అంతకు ముందు నారాయణస్వామి చిత్రపటానికి ఎల్కేపీ అధ్యక్షుడు గురుప్రసాద్, కార్యదర్శి పద్మజ, ఉపాధ్యక్షుడు సంగాల నారాయణస్వామి, సోమిరెడ్డి, అస్లాంబాషా, లోకేష్ తదితరులు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

నడిబొడ్డునే నాసిరకం పనులు



సప్తగిరి సర్కిల్‌లో కంకర తేలిన రోడ్డు

అనంతపురం కార్పొరేషన్: దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమయ్యారు తెలుగు తమ్ముళ్లు. అడ్డగోలుగా పనులు, బిల్లులు చేసుకుంటూ రూ.లక్షల్లో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. అభివృద్ధి మాటున అరాచకం చేస్తున్నా.. ఇంజినీర్లు చేష్టలుడిగి చూస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా రూ.40 లక్షలతో వివిధ డివిజన్లలో రోడ్ల ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. నగరం నడిబొడ్డున అది కూడా నగర పాలక సంస్థ కార్యాలయానికి ఎదురుగా సప్తగిరి సర్కిల్‌లో వేసిన ప్యాచ్ వర్క్ అప్పుడే తేలిపోయింది. పట్టుమని పది రోజులు కూడా సక్రమంగా లేదు. అప్పుడే రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది.

ప్రజలను ప్రేమించడమే దేశభక్తి

అనంతపురం కల్చరల్: మతాల పేరుతో సమాజాన్ని విడదీయడం దారుణమని, ప్రజలను ప్రేమించడమే నిజమైన దేశభక్తి అని జేవీవీ రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గేయానంద్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజలను చైతన్యపరచడానికి నవయుగ వైతాళికుడు గురజాడ చేసిన కృషి అపారమన్నారు. ఆయన సేవలను గుర్తించి విజయనగరంలో ఆయన పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు సాకే తిరుపాల్, డాక్టర్ ప్రసూన, వీరరాజు, గాంగేనాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





సానుకూలమైన ఆలోచనలు సంక్షేమానికి, విజయానికి అవసరమైన శక్తిని ఇస్తాయి. ఒత్తిళ్లను తగ్గిస్తాయి. మంచి హార్మోన్లను విడుదల చేసి, శారీరక, మానసిక ఆరోగ్యాలకు దోహదం చేస్తాయి. అందుకే గొప్పగా ఆలోచించాలి. పెద్ద పెద్ద కలలు కనాలి. ఉన్నత లక్ష్యాలను మనసులో నాటుకోవాలి.

వంద పూలై విరిసే జ్ఞాపకాలు!

జ్ఞాపకాలు గతం ఇనప్పెట్టెలో భద్రంగా ఉంటాయి. దాని మూత తీయాలని అనుకున్నప్పటి నుండి మాన సిక వైబ్రేషన్‌కు గురవుతాం. చిన్ననాటి స్మృతులు ముసురుకుంటాయి. సాధారణంగా పదేళ్ళ వరకు బాల్యదశ ఉంటుంది. ఈ స్లాట్ మనిషికి స్వర్ణయుగం. ప్రతిక్షణం కుటుంబంలో, సమాజంలో, వీధిలో, ఊరిలో, బడిలో, పక్కింట్లో ప్రతిచోట ప్రతి అను భవం గుండె గోడలమీద బొమ్మ కడుతుంది. నలుపు తెలుపు రంగుల్లో సినిమా రీల్‌లాగా గర్‌గర్ మని ఒక్కో సంఘటన మనసు తెర మీద కద లాడుతుంది.

ఒక పండగని జ్ఞాపకం అయితే మరింత సంబరం. పూలదొంతర అల్లాలంటే ఒళ్ళంతా పులకరింతే. గత పరిమళాల జల్లుల్లో తడిసి ముద్దవడమే. బతుకమ్మ పండుగ రంగుల హరివి ల్లుల్ని తెంపి వెన్నెల్లో ఆరేసి, వర్షంలో తడిసిన మట్టి సుగంధాలలో నానబెట్టి, కొత్త రంగురం గుల కాంతి తరంగాలని వాటికి పట్టించి నూటొక్క మొగ్గల్ని, పూలని, ఆకుల్ని తొడిగిన పూగుత్తుల్ని పేర్చాలంటే అంత సులభం కాదు. ఇలాంటప్పుడే గత అవిస్మృత ఖజానా విలువ తెలుస్తుంది. పూలను పరిరక్షించే ఇనప్పెట్టె తయారు కానందుకు బాధ. పుప్పొడిలా రాలిన కనబడని కన్నీటి తుంపరల్ని ఎలా, ఎక్కడని దాచగలం.

మాది ఊరు కాని ఊరు. పట్టణంలో ఒదిగి ఉన్న ఊరు. వరంగల్ జిల్లాలోని హనుమకొండ. మా ఇంటి చుట్టూరా అనేకానేక చిన్నా పెద్దా ప్రాచీన గుళ్ళు, చారిత్రక ప్రదేశాలు. ఇంటికి కాస్త దూరంలో మూడు పెద్ద గుట్టల మధ్య పద్మాక్షి గుడి. గుడి కింద నీటి గుండం. అందులో బంగారు జింక ఆకర్షణలా తామరాకులు, పూలు! గుట్టల మీద సీతా ఫలాలే కాదు, ఎన్నో రకాల పూలు, గునుగు పూలు, తంగేడు, గన్నేరు పూలు... ఎన్నెన్నో.



మా ఇంట్లో నాకన్నా చిన్నది చెల్లెలు. ఇంటి పక్కన పాటకుల ఇంట్లో ఓ చిట్టెమ్మ. ఇంటి పక్కల చుట్టాలు, పరిచయస్తుల ఇళ్ళల్లో ఆడపి ల్లలు. వీళ్ల బొడ్డెమ్మ ఆడేవాళ్లు.

భాద్రపదం ప్రకృతి పచ్చదనానికి గర్భ శిశువు. ఈ మాసం ప్రకృతి పరవశించే నిండు చూలాలు. బొడ్డెమ్మ వస్తుందంటేనే పూలవేట షురువయ్యేది. ఆడపిల్లల్ని బొడ్డి అంటారు. బొడ్డి అంటే చిన్నది అని అర్థం. ఈ ఆడపిల్లలు ఆడే బొడ్డెమ్మ ఒక ప్రత్యేక పండగ.

ఎవరి ఇంట్లోనూ పదిమంది ఆడే ఆట స్థలం ఉండేది కాదు. గుడిలోనో, ఏదో ఒక బహిరంగ ప్రదేశంలోనో వాళ్ళు వెదురుతో చేసిన చిన్న చిన్న సిబ్బుల్లో పూలు పట్టుకుని అక్కడికి చేరేవారు. అక్కడ కుమ్మరాయన మట్టితో బొడ్డెమ్మ గద్దె తయారు చేసేవాడు. కిందివైపు పెద్దగా పైవైపు చిన్న ఆకారంతో మట్టితో చతురస్రాకారంతో గద్దె కట్టేవాడు. దానికి నాలుగు దిక్కులా ప్రమిదలు పెట్టేవాడు. దానిలో రోజుకొక్కరు 9 రోజులు 9 ఇళ్ళలోంచి నూనె తెచ్చేవారు. దాని చుట్టూ రోజూ కొత్తగా ముగ్గులు వేసేవారు.ఈ పనంతా బాలికలే చేసేవారు.

ఊరి వడ్రంగి కర్రతో బొడ్డెమ్మ గద్దె చేసి ఇచ్చేవాడు. దానికి పసుపు, తెలుపు రంగులు వేసే వారు. దానిమీద కూడా ప్రమిదలు ఉండేవి. మధ్యలో పిల్ల బతుక మ్మని చెక్కేవాడు. దాన్ని జ్ఞాపకం పెట్టుకుని డెబ్బై ఐదేళ్ల తర్వాత అలాంటి కర్ర బొడ్డెమ్మ వస్తువుని ఆద్యకళ మ్యూజియం కోసం సేకరించాను.

మగపిల్లల టీం మహాలయ అమావాస్య నాడు ప్రారంభమయ్యే బతుకమ్మ కోసం సంచులు పట్టుకుని పూలవేటకు వెళ్ళేవారం. గునుగు పూలు తెచ్చి రకరకాల రంగులద్దేవాళ్ళం. తంగేడు పూలు, ఆకులు, కొమ్మలతో తెంపే వాళ్ళం. ఇంటికి వచ్చి పూలను వేరు చేసేవాళ్ళం.

జలాశయాల్లోంచి తెచ్చిన తామర ఆకుల్ని సిబ్బుల కింద ఉంచేవాళ్ళు. కొంతమంది ఎర్రని తామరపూవుని పైన అలంకరించేవాళ్ళు. పై భాగాన పసుపు ముద్ద పెట్టి గౌరమ్మ తల్లిగా సంభావించేవారు. మరి కొందరు గుమ్మడి ఆకుల్ని సిబ్బులో పరిచి బతుకమ్మ పైన గుమ్మడిపూవుని ఉంచేవారు. పూవు మధ్య భాగం కేసరాలు ఉండేచోట పసుపు రంగు ఉండేది. దాన్నే గౌర మ్మగా భావించేవారు. మేం ఇంత కష్ట పడితే మాకు దక్కేది ఆటపాటల తర్వాత అక్కలు, అమ్మలు పెట్టే ప్రసాదం. రోజుకో తీరొక్క ప్రసాదం. ఇంటికోరకం ప్రసాదం తెచ్చి అన్నీ ఒక్కో గంపలో వేసి వాళ్లు తిని మాకు పెట్టేవారు. ఆ రుచే వేరు. తలుచు కుంటేనే నోరూరుతుంది.

బొడ్డెమ్మ, బతుకమ్మలను తలకెక్కించుకునే సందర్భంలో ఆకులతో చేసిన పీకలు ఊదే వాళ్ళం. మరికొందరి దగ్గర కర్రతో చేసిన గొట్టం ఉండేది. ఎండిన గింజల్నో, కాగితం తుంచి దాన్ని నమిలి చేసిన ముద్దనో కర్ర బర్మారులో పెట్టి బాగా ఊదేవాళ్లం. అది పిస్తోలు పేల్చినట్లు శబ్దం అయ్యేది. ఎవరి శబ్దం పెద్దగా ఉంటే వారిపై ప్రశంసల పూల జల్లు పడేది. అలా తొమ్మిది రోజులు ఈ కార్యక్రమం కొనసాగేది. ఆరో రోజు అరెం. అంటే ఆరోజు బతుకమ్మ పేర్చరు. సెలవుదినం. ఆట ఉండదు. మాకు కూడా కాస్త తీరిక దొరి కేది. కాకపోతే బతు కమ్మ ప్రసాదం దొరికేది కాదు. పండుగ తొమ్మిది రోజులు చాలా ఇండ్లల్లో శాకాహారమే ఉండేది. కొత్త ధాన్యంతో, పప్పు లతో తయారు చేసిన రుచి ఈనాటికీ గుర్తు చేసుకుంటే నోరూరుతుంది.



బతుకమ్మ తొమ్మిది రోజులు ఆటపాటలతో గడిచేది. అక్కలు, చెల్లెల్లు, కోడళ్ళు, మరదళ్లతో సందడిగా గడిపిన క్షణాలు ఈ తరాలకు దక్కని మహోత్కృష్ట గడియలు.

బతుకమ్మలనే కాదు ఇంటిని, ఇంటి పరిస రాల్ని శుభ్రపరిచి అలంకరించేవారు. ఇళ్ళ ముందు భాగం ముగ్గులు రంగులతో మెరిసిపో యేవి. వివిధ రకాల పూలు ఒక్కచోట ఉంచడం వల్ల చక్కని సువాసనలతో ఆ ప్రదేశం ఎంతో బాగుండేది. బతుకమ్మలపై కొందరు అగరుబ త్తీలు పెట్టేవారు. చాలా కాలం దాచిపెట్టి పండుగ రోజున కట్టుకునే పీతాంబరం, పాత చీరల ప్రత్యేక వాసన ఇంకా పీల్చు తున్నట్లే ఉంటుంది. రోజూ అలికిన తాజా వాసన సైతం పండుగ ప్రత్యేకతని చెప్పకనే చెప్పేది.

స్త్రీలు పాడే పాటలు చెవుల్లో ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. బతు కమ్మ పేర్పులోని నేర్పు ఆశ్చర్యం కలిగిస్తుంది. వాళ్ళ కళాత్మక భావనల్నిచూసి వారిపై ఎనలేని ప్రేమ, గౌరవం కలిగేది. ఊరు ఊరంతా ఒక్కటై చేసు కునే పండుగ పట్ల గౌరవం ఇనుమడించేది. పండుగ కాలంలో స్త్రీలు మిగతా వాళ్ళని గౌరవంగా చూసే వాళ్ళు. అందరూ సమానమే. ఎందుకంటే అందరూ సుమంగళులే. అంటే గర్భం ధరించి పిల్లల్ని కనగ లిగే అర్హత ఉన్నవాళ్ళే. వాళ్లే బతుకమ్మ ఆడాలి. వాయనాలు పెట్టుకోవాలి.

బాలికల గుంపు చిన్న మగపిల్ల గాళ్ల గుంపు, యువతుల గుంపు, తల్లుల గుంపు, అమ్మమ్మ నాన మ్మల గుంపు ఇలా ఎవరి గుంపు వారిదే. ఎవరి స్నేహితులతో వారు కలిసిమెలిసి ఉండేవారు. హాస్యం వందపూలై పూసేది. సామెతలతో సంభాషణ నవరసాలతో ఆకట్టు కునేది. వరసలను బట్టి హాస్యం, చతురోక్తులు ఉండేవి. ఇది పండుగ సంబరాన్ని మరింత పెంచేది.

ఊరు ఊరంతా గాన ప్రవా హంలో ఈదేది. చెరువు గట్టో, నీటి గుండాల పక్కనో వాళ్ల నృత్యంతో భూమి పులకరించేది. సంధ్యాసమ యంలో ప్రకృతిని చూసి మా ఒడలు పులకరించేది.

నాడు బతుకమ్మ ప్రకృతి పండుగ. నా జ్ఞాపకాలలో ఆనాటి ప్రాకృతిక సౌందర్యం చూడడం కోసం ఊరూ, వాడా, అడవీ, పల్లె తిరుగుతూనే ఉన్నాను. ఏదో తెలి యని శూన్యం. నా జీవితకాలం అంతా పద్మాక్షి గుట్ట కింద నీటి గుండంలోని తామర పూవుల సువాసన ఇంకా వెన్నాడుతోంది. కొండమీది గోగుపూలు రమ్మని చేతులు చాస్తున్నాయి. పండిన సీతాఫలాల సువాసన, రుచి, బతుకమ్మ ప్రసాదాలు తిన్నాక చాలా గంటల వరకు చేతికం టిన కమ్మని సువా సన కోసం మళ్లీ బతు కమ్మ పండుగ ఎప్పు డొస్తుందా అని ఎదురు చూపు!



– జయధీర్ తిరుమలరావు

తాత్త్వికథ

దీక్ష... దక్షత



అది కార్తీక మాసం. ఊర్లో చాలామంది అయ్యప్ప దీక్షలో ఉన్నారు. వారందరినీ చూసిన ఓ యువకుడికి కూడా అయ్యప్ప మాల ధరించాలనిపించింది. అనుకున్నదే తడ వుగా శివాలయం వద్ద ఉన్న గురుస్వామి గుర్తుకు వచ్చాడు. అన్నీ సిద్ధం చేసుకుని మాలధారణకు బయలుదేరాడు. అదే సమయంలో గురుస్వామి గుడి పక్కనున్న నదిలో స్నానం చేస్తూ కనిపించాడు. ఆ యువకుడు ఒడ్డున నిలబడి నమస్క రించి ''స్వామీ, నాకు కూడా అయ్యప్ప మాల వేయాలని ఉంది. అయితే నలభై రోజుల మండల దీక్ష చేయలేను. రెండు వారాలు మాత్రమే మాల ధరిస్తాను'' అని చెప్పాడు. కారణమేమిటని అడిగాడు గురుస్వామి.

''నాకు చన్నీళ్ళ స్నానం అంటే భయం. అందుకని నలభై రోజులు ఉండలేను'' అని బదులిచ్చాడు యువకుడు. ''అ దేమీ లేదు, కొన్నాళ్ళు చన్నీళ్ళ స్నానం చేస్తే అదే అలవాటైపో తుంది''అని ధైర్యం చెప్పాడు గురుస్వామి. అది అసాధ్యం అన్నట్లుగా ముఖం పెట్టాడు యువకుడు. ''సరే, నేను చెప్పి నట్లు చేస్తావా?'' అని అడిగాడు గురుస్వామి.

''చన్నీళ్ళ స్నానం తప్పితే మరే పని చేయమన్నా చేస్తాను '' అని గట్టిగా చెప్పాడు ఆ యువకుడు. వెంటనే గురుస్వామి ''నీ చేతి వేలు ఈ ప్రవహించే నదిలో పెట్టు!'' అన్నాడు. అదెంత పని అన్నట్లుగా నీళ్ళలో వేలు పెట్టాడు. ఎలాగుందని అడిగాడు గురుస్వామి. చలిగా ఉందని సమాధానమిచ్చాడు యువకుడు. ఈసారి చేయి మొత్తం నీళ్ళలో పెట్టమని కోరాడు. అలాగే మొత్తం చేయి పెట్టిన యువకుడు భలే చలిగా ఉందని అరిచాడు. 'ఈసారి గట్టు నుంచి నదిలోకి దూకు!'' అన్నాడు. ఎగిరి దుమికాడు యువకుడు. వెంటనే స్వామి చలి ఎలా ఉందని ప్రశ్నించాడు. ''చలే లేదు స్వామీ! వెచ్చగా ఉంది!!'' అని నీళ్ళలో ఈతకొడుతూ బదులిచ్చాడు యువకుడు. గురు స్వామి నవ్వుతూ ''నిండా మునిగితే చలి లేదన్నారు పెద్దలు. రోజూ చన్నీళ్ళ స్నానం చేస్తే చలిగిలీ కనిపించవు. అలవాటయ్యాక చన్నీళ్ళ స్నానమే బాగుంటుందని అంటావు. చన్నీళ్ళ స్నానానికి భయపడి దీక్ష కాలాన్ని ఎందుకు తగ్గించుకుంటావు. దీక్ష ఫలితం పూర్తిగా ఆస్వాదించాలంటే నలభై రోజులు ఉంటేనే బాగుంటుంది '' అని సలహా ఇచ్చాడు. అలాగేనని సంతోషంగా నలభై రోజుల దీక్షకు ఉపక్రమించాడు ఆ యువకుడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

ఈ సినిమాకి ఆ ఇద్దరే స్టార్స్ - పవన్ కల్యాణ్



● ఇమ్రాన్ హష్మీ, సుజిత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య

''ఒక సినిమా కోసం ఇంతమంది ఎదురు చూస్తున్నారని నాకు తెలియదు. 'ఖుషి' చిత్రం సమయంలో ఈ జోష్ చూశాను. అలాంటి జోష్ మళ్లీ 'ఓజీ'కి వచ్చింది. సినిమాలు వదిలేసి రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా మీరు (ఫ్యాన్స్) నన్ను వదల్లేదనిపిస్తోంది.. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. సుజిత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్, ప్రియాంకా మోహన్ జోడీగా నటించిన చిత్రం 'ఓజీ'. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ' ప్రీ రిలీజ్ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ–''సుజిత్ నా అభిమాని. 'జానీ' మూవీ చూసి నాతో సినిమా తీయాలనుకున్నాడు. 'సాహో' సినిమా తర్వాత సుజిత్‌తో సినిమా చేస్తే బాగుంటుందని త్రివిక్రమ్ చెప్పి, నాకు పరిచయం చేశారు. తను కథని ముక్కలు ముక్కలుగా చెప్పినా సినిమా తీసేటప్పుడు తన సత్తా తెలిసింది. ఈ సినిమాకి ఇద్దరే స్టార్స్... నాట్ పవన్ కల్యాణ్. వారిలో మొదటి క్రెడిట్ సుజిత్‌ది. రెండో క్రెడిట్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌ది. 'నేను డిప్యూటీ సీఎం అని ఈ రోజు మరచిపోయాను. మీరు ఊహించుకోండి.. ఒక ఉప ముఖ్యమంత్రి ఇలా కత్తి పట్టుకుని వస్తే ఊరుకుంటారా? సినిమాల్లో కాబట్టి చెల్లిపోయింది. నేను సినిమా ప్రేమికుణ్ణి. సినిమా చేసేటప్పుడు దాని ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. రాజకీయాలు చేసేటప్పుడు అదే ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. సుజిత్ టీమ్ చాలా అద్భుతమైనది. ఇలాంటి టీమ్ నేను దర్శకత్వం వహించే టప్పుడు నాకూ ఉండి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాణ్ని కాదేమో? ట్రైలర్ పూర్తిగా సిద్ధం కాలేదంటే కుదరదు. మా వాళ్లకి (ఫ్యాన్స్) ఈ రోజు ఎంతో కొంత చూపించాల్సిందే. నాకు తెలుసు కదా... అమితాబ్ బచ్చన్‌గారి కోసం నేను చిన్నప్పుడు ఎలా కొట్టుకునేవాణ్నో. ఆయన సినిమాకి టిక్కెట్ దొరక్క పోతే చంపేద్దాం అనిపించేది. 'ఓజీ' చిత్రం అందర్నీ రంజింప జేసేలా ఉంటుంది'' అని చెప్పారు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, వై. రవిశంకర్, రచయిత కోన వెంకట్, ప్రియాంక మోహన్, సంగీత దర్శకుడు తమన్, నటులు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్ మాట్లా డారు.

దసరాకి పాట?



● చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాట లను సిద్ధం చేశారట భీమ్స్. ప్రమోషన్లలో భాగంగా దసరా సందర్భంగా 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి తొలి పాటను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వినాయక చవితి పండగని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసిన యూనిట్.. ఇప్పుడు దసరాకి తొలి పాట రిలీజ్ చేసి, సినిమాపై మరింత క్రేజ్ పెంచాలన్నది ఆలోచనట. మరి... దసరా పండగకి పాట విడుదల చేస్తారా? లేదా? లేకుంటే మరేదైనా అప్‌డేట్ ఉంటుందా? అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహించిన 'విశ్వంభర' సినిమా 2026 వేసవిలో రిలీజ్ కానుంది.

అక్టోబరులో ఆరంభం



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబరు మొదటివారంలో ప్రారంభించనున్నారని తెలిసింది. తొలి షెడ్యూల్‌లోనే వెంకటేశ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట త్రివిక్రమ్. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు 'ఆనంద నిలయం, వెంకట రమణ: కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్స్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని, వైజాగ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే... వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ కథ, సంభాషణలు అందిం చారు. ఈ రెండు సినిమాలూ విజయాలు సాధించాయి. దీంతో వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శక త్వంలో రూపొంద నున్న ఈ సిని మాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఉండటం సహజం.

బ్యూటీ నాకు ఎంతో ప్రత్యేకం - వీకే నరేశ్



● అంకిత్, నీలఖి, వీకే నరేశ్

''నా కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. ఇన్నేళ్ల నా కెరీ ర్‌లో 'బ్యూటీ' చిత్రం మాత్రం నాకు ఎంతో ప్రత్యేకం. అన్ని వర్గాల వారికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. లవ్, ఎమోషన్స్, ఫ్యామిలీ... ఇలా అన్ని అంశాలను జోడించిన ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని నటుడు వీకే నరేశ్ తెలిపారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వీకే నరేశ్, వాసుకి ప్రధాన పాత్రలు పోషించారు. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో వానర సెల్యూలా యిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్‌పై అడిదల విజయ పాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ సక్సెస్ మీట్‌లో అంకిత్ కొయ్య మాట్లాడుతూ– ''బ్యూటీ' అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువైంది. క్లయిమాక్స్ తర్వాత అందరూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు. అదే మా విజయం'' అని చెప్పారు. ''మా సినిమా అందర్నీ అలరిస్తోంది. 15 థియేటర్స్‌కి వెళ్లాను.. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు జె.ఎస్.ఎస్ వర్ధన్. ''మన జీవితాల్ని చూపించే చిత్రమిది. ఇది కేవలం సినిమా కాదు.. జీవితం'' అని అన్నారు విజయ్‌పాల్ రెడ్డి. ''నా పాత్రకి ప్రశంసలు కురిపిస్తున్న ప్రేక్షకులకు ధన్యవా దాలు'' అని నీలఖి తెలిపారు. రైటర్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం, కెమెరామేన్ సాయి కుమార్ ధారా, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు తదితరులు మాట్లాడారు.

దేవగుడి విజయం సాధించాలి - మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి



● ఆది నారాయణరెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, బెల్లం రామకృష్ణారెడ్డి, అభినవ శౌర్య, అనుశ్రీ

''దేవ గుడి' సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ బాగు న్నాయి. ఈ చిత్రంలోని డైలాగులు మా కడప మాండలికంలో ఉండటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధించి, దర్శక-నిర్మాత రామకృష్ణారెడ్డిగారికి, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు పేరు తీసుకు రావాలి'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి చెప్పారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దేవగుడి'. బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆదివారం నిర్వహించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌కి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ– ''సినిమాలు వినోదం కోసమే కాదు... ప్రేక్షకులకు మంచి సందేశాన్నిచ్చేలా ఉండాలి'' అన్నారు. ''నవంబరులో విడుదల కానున్న మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని బెల్లం రామకృష్ణారెడ్డి కోరారు. సంగీత దర్శకుడు షేక్ మదీన్, కెమెరామేన్ లక్ష్మీకాంత్, నటుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఓటీటీ

ఇది చూడొచ్చు

సమాజపు పరదా తీసిన సినిమా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం పరదా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలం నడుస్తున్నా, ఇంకా ఎక్కడో ఈ సమాజంలో మూఢనమ్మకమనే పరదా ఉంది. మరీ ముఖ్యంగా ఇది ఉత్తర భారతంలో కొన్ని రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. ఆ మూఢనమ్మకపు పరదాని చాలా సున్నితమైన కథాంశంతో మన ముందుకు తీసుకువచ్చారు దర్శకుడు ప్రవీణ్. ఈ సినిమా ప్రధాన పరదాలో (పాత్రలో) కథానాయిక అనుపమా పరమేశ్వరన్ నటించారు. మరో ప్రధాన పాత్రలో మలయాళ నటి దర్శనా రాజేంద్రన్, అలాగే మరో పాత్రలో సంగీత నటించి, మెప్పించారు. ఈ కథలో సున్నితమైన అంశాన్ని ఎంతో హృద్యంగా మలిచారు దర్శకుడు. అంతలా ఏముందో ఈ కథలో ఓసారి చూద్దాం. ఓ మారు మూల గ్రామంలో వింతైన ఓ ఆచారాన్ని పాటిస్తుం టారు. తమ గ్రామాన్ని దేవత శపించిందని, శాప విమోచన కోసం గ్రామంలో ఉన్న ప్రతి అమ్మాయి తప్పనిసరిగా బయటకు వచ్చినపుడు పరదాతోనే రావాలని ఆచారం ఉంటుంది. ప్రతి అమ్మాయి తమ కుటుంబ సభ్యులను తప్ప మిగతా వారందరి దగ్గర పరదాతోనే ఉంటుంది. వాళ్ళలో సుబ్బలక్ష్మి (అనుపమ) కూడా ఉంటుంది. కాక పోతే సుబ్బలక్ష్మి చదువుకున్న అమ్మాయి. అయినా తమ గ్రామంలో తరతరాల నుండి వస్తున్న సాంప్రదాయాన్ని తూచా తప్పకుండా పాటిస్తుంటుంది. కానీ ఓరోజు గాలి వాటాన సుబ్బలక్ష్మి పరదా తొలగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మికి కూడా తెలియకుండా ఓ ఫేమస్ మేగజీన్ ఫొటోగ్రాఫర్ సుబ్బలక్ష్మి ఫొటో తీసి ప్రచురిస్తాడు. సరిగ్గా సుబ్బలక్ష్మి పెళ్ళి సమయంలో ఆ మేగజీన్ బయటపడి ఊరు మొత్తం సుబ్బలక్ష్మి ముఖాన్ని చూసేస్తుంది. దాంతో అల్లకల్లోలం అవు తుంది. దీనికి ప్రతిగా సుబ్బలక్ష్మి ఆత్మహత్య చేసుకోవాలని ఊరువాళ్ళు నిర్ణయించినా ఓ మేజిక్ వల్ల ఆత్మహత్య ఆగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మి ఊరి కోసం ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుని తన తప్పు లేదని నిరూపించుకుంటానని, లేదంటే అప్పుడే ఆత్మ హత్య చేసుకుంటానని ఫొటోగ్రాఫర్ కోసం హిమాలయాల్లో ఉన్న ధర్మశాలకు బయలుదేరుతుంది. మరి... సుబ్బలక్ష్మి ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుందా? తిరిగి ఊరెళ్ళిన తరువాత అక్కడ తనకు ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది మాత్రం ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'పరదా' సినిమాలోనే చూడాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా, ఎలాగైనా నమ్మకం ఉండొచ్చు కానీ మూఢనమ్మకమనే పరదా మాత్రం ఉండకూడదు. నేటి సమాజంలో ఇంకా మూఢనమ్మ కాలనే పరదాలను తీసేసిన సినిమా ఈ 'పరదా'. పిల్లలు కాకుండా పెద్దవాళ్లు చూడదగ్గ సినిమా ఇది.



– హరికృష్ణ ఇంటూరు